క్లుప్తంగా

నేడు పెంపుడు జీవాలకు ఉచిత టీకాలు

మాగనూర్: ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పశువైద్యశాలలో గురువారం పెంపుడు కుక్కలకు, పిల్లులకు రేబిస్ టీకాలు ఉచితంగా ఇస్తున్నట్లు జూనియర్ అసిస్టెంట్ వినయ్‌కుమార్ బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని యజమానులు వారి కుక్కలను, పిల్లులను స్థానిక పశువైద్యశాలకు తీసుకువచ్చి టీకాలు వేయించుకోవాలని కోరారు.

నారాయణపేట రూరల్ : ప్రపంచ జొనాసిస్ డే సందర్భంగా పట్టణంలోని పశువైద్యశాలలో ఉచితంగా టీకాల పంపిణీ చేపడుతున్నట్లు డాక్టర్ అనురిద్ ఆచార్య తెలిపారు. ఇంట్లో ఉండే పెంపుడు జంతువులను విధిగా తీసుకుని వచ్చి టీకాలను వేయించుకోవాలన్నారు.

వెంటనే రుణమాఫీ చేయాలి

నారాయణపేట టౌన్: రైతులు వ్యవసాయం కోసం తీసుకున్న రూ.లక్ష రుణమాఫీ చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వినయ్‌మిత్ర యాదవ్ బుధవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. బ్యాంకు అధికారులు రైతులు రుణాలు చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నారని, దీంతో కొత్త రుణాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

ప్రొసీడింగ్ అందజేత



మాగనూర్: నేరడగందొడ్డి పంచాయతీ భవన నిర్మాణం కోసం ఆర్‌ఐ శ్రీశైలం స్థలం గుర్తించి బుధవారం ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డికి ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కార్యదర్శి లింగప్ప, సర్వేయర్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

మాగనూర్: మండలంలోని నేరడగంలో ఎమ్మార్పీఎస్ కమిటీని నియోజకవర్గ కన్వీనర్ కల్యాణ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కిరలింగప్ప, ఉపాధ్యక్షుడిగా నరేష్, అధికార ప్రతినిధి సూతరి బాలు, సభ్యులను ఎంపిక చేశారు.

ఘన సన్మానం

ధన్వాడ: మండల కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన చంద్రశేఖర్ పోస్టల్ శాఖలో ఉద్యోగం సాధించి సొంత గ్రామంలో పోస్టింగ్ వచ్చిన సందర్భంగా ఆయనను గ్రామస్తులు బుధవారం శాలువా, పూలమాలతో సన్మానం చేశారు. విద్యార్థులు మంచిగా చదివి ఉన్నత స్థాయికి వచ్చినప్పుడే తల్లితండ్రులకు సంతోషంగా ఉంటుందని తెలిపారు.

పౌష్టికాహారం తప్పనిసరి

మాగనూర్: గర్భిణులు, బాలింతలు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని నేరడగం సర్పంచ్ అశోక్‌గౌడ్, ఎంపీటీసీ ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఒకటి, రెండవ అంగన్‌వాడీ కేంద్రాలో లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.


ఊట్కూర్: మండలంలోని తిప్రాస్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం–2లో బుధవారం గర్భిణులు, బాలింతలకు సర్పంచ్ సుమంగళి గుడ్లను పంపిణీ చేశారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం



కోస్గి: ప్రజా సంక్షేమ పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని నాయకులు తెలిపారు. పాదయాత్ర మూడోరోజు బుధవారం మున్సిపల్ పరిధిలోని 15, 16వ వార్డుల్లో కొనసాగింది. కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేస్తూ కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వాలని ఓటర్లను కోరారు. ప్రజలు కేసీఆర్ పాలనతో విసుగు చెందారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ వార్ల విజయ్ కుమార్, రఘువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్, రాములు, రమేష్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి



మాగనూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పూజారి కిష్టప్పకు చెందిన గొర్రెల పిల్లలపై కుక్కలు దాడి చేసి చంపేశాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కిష్టప్ప రోజులాగే గొర్రెలమందను మేత కోసం సమీపంలోని పొలాలకు తీసుకువెళ్లగా వాటి పిల్లలను గ్రామ సమీపంలోని ఓ చింత చెట్టుకింద జాలి ఏర్పాటు చేసి ఉంచాడు. అయితే గ్రామంలోని కొన్ని కుక్కలు ఒక్కసారికి వాటిపై దాడి చేయడంతో గొర్రెపిల్లలు దాదాపుగా 15 వరకు మృత్యువాత పడ్డాయి. గొర్రెల మృతితో నష్టపోయిన తనను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

జాడలేని అభివృద్ధి పనులు

- వార్డుల్లో మౌలిక వసతులు కరువు
- రోడ్లు వేసినా అధ్వానంగా మారుతున్న వైనం
- డ్రెయినేజీలు లేక అస్తవ్యస్తం



ఇళ్ల మధ్యలో పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు



బాబా కాలనీలో అధ్వానంగా మట్టిరోడ్డు

నారాయణపేట టౌన్: పట్టణంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామని ఓ పక్క అధికారులు చెబుతున్నా ఆచరణలో మాత్రం వివిధ కాలనీల్లో కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపాలిటీని 7వ వార్డులో మౌలిక వసతులు లేక ఇబ్బందులు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అశోక్ నగర్, బాబాకాలనీ, గాయత్రి నగర్, భీవండి కాలనీ ఉండగా, వార్డు పరిధిలో వ్యవసాయ మార్కెట్ యార్డు, పోలీస్ స్టేషన్, అగ్నిమాపక కేంద్రం ఉంది. పలు కాలనీల్లో సీసీ రోడ్డు కొంత మెరుగ్గా ఉన్నప్పటికీ బాబా కాలనీలో రోడ్డు మధ్యలో దెబ్బతింది. గాయత్రినగర్‌లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. దీంతో వానాకాలంలో మురుగు లోతట్టు ప్రాంతంలో నిలిచిపోయి దుర్గంధం వెదజల్లుతుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారానికి ఒకసారి కూడా పారిశుద్ధ్య పనులు చేపట్టడం లేదని అంటున్నారు. కనీసం రోడ్లు కూడా ఊడ్చడం లేదని వాపోతున్నారు. గత నెలలో కౌన్సిల్ సమావేశంలో వార్డు కౌన్సిలర్ ఎండి సలీం నేల పై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఇతర ఎలాంటి వసతులు కల్పించడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు. అయిన ఇప్పటి వరకు కనీసం వార్డులో పిచ్చి మొక్కలు తొలగించలేదని వాపోయారు. ప్రధానంగా హైదరాబాద్ రోడ్‌కు ఉన్న కాలనీల్లో మౌలిక వసతులు లేక ఇబ్బందులు తప్పడం లేదు. కాలనీలో అధికారులు పర్యవేక్షణ చేపట్టి నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు.

దశలవారీగా పరిష్కరిస్తాం

7వ వార్డు పరిధిలో ఉన్న డ్రెయినేజీ, రోడ్లు పరిశీలించి దశలవారీగా మరమ్మతు చేపడుతాము. పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు వాటితో పాటు పారిశుద్ధ్య పనులను సిబ్బంది ద్వారా చేయించి పరిశుభ్రం చేయిస్తాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

వేతనాల కోసం గ్రామస్తుల విరాళం



మాట్లాడుతున్న హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి

ఊట్కూర్: మండంలోని అవుసలోనిపల్లె పాఠశాలలో విద్యా వలంటీర్ల వేతనాలకై రూ.1.50లక్షలు విరాళం ఇచ్చేందుకు గ్రామస్తులు ముందుకొచ్చారు. బుధవారం హెచ్‌ఎం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. పాఠశాలలో 7 తరగతులలో 185 మంది విద్యార్థులు, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారని చెప్పారు. ఉపాధ్యాయుల కొరత ఉండడంతో సరైన విద్య అందించలేకపోతున్నామని సమావేశంలో తెలిపారు. ముగ్గురు విద్యా వలంటీర్ల అవసరముందని వారికి గౌరవ వేతనం ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. తల్లిదండ్రులు విద్యార్థికి రూ.800 చొప్పున వసూలు చేసి 15రోజుల్లో అందిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో రూ.20 వేల నగదును హెచ్‌ఎంకు అందించారు. సమావేశంలో ఎస్‌ఎంసీ చైర్మన్ ఆనంద్ కుమార్‌రెడ్డి, రమేస్, లక్ష్మయ్య, వీరశేఖర్‌రెడ్డి, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేయూతనందిస్తాం



దామరగిద్దలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: జిల్లాలోని మత్స్యకారులకు అన్ని విధాలుగా తమ వంతు చేయూతనందిస్తామని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన కోళ్ల వెంకటేశ్, డైరక్టర్ నీరటి నర్సింహులు నాయుడు ఎమ్మెల్యే శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో సరాఫ్‌నాగరాజు, రాములు, భీమయ్య, సంజీవ్‌కుమార్, ఓబన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ దేశానికే ఆదర్శం

దామరగిద్ద: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముస్తాపేట్ గ్రామంలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం బాపన్‌పల్లి గ్రామంలో మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలోని రైతువేదికలో అన్ని గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన 81 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లావణ్య, ఎంపీపీ నర్సప్ప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, వింగ్ అధ్యక్షుడు ఈదప్ప, ఆశన్న, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు భీమయ్యగౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారులపై ఆగ్రహం

రైతుబంధు డబ్బులను బకాయిల పేరుతో ఇవ్వకుండా ఖాతాలనే హోల్డ్‌లో ఉంచొద్దని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బ్యాంకు సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపన్‌పల్లిలో రైతు లక్ష్మీనారాయణ బ్యాంకు అధికారుల తీరుపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే నేరుగా బ్యాంకుకు చేరుకుని అధికారులను ఆరా తీశారు. రైతులకు సాయం అందించి వ్యవసాయ పెట్టుడులకు డబ్బులు ఉపయోగపడేలా ఏడాదికి రెండు సార్లు వానాకాలం, యాసంగిలో రైతుబంధు ద్వారా ప్రభుత్వం డబ్బులు అందిస్తుందన్నారు. పంటరుణాల బకాయిలు ఉంటే అవగాహన కల్పించి కట్టించుకోవాలన్నారు. రైతులకు ఇబ్బంది కలిగించొద్దని బ్యాంకు అధికారులకు విన్నవించారు.

పథకాలే ఆకర్షిస్తున్నాయి..

బీఆర్‌ఎస్ రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే ప్రజలను ఆకర్షిస్తున్నాయని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాపన్‌పల్లిలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారిని పార్టీ కండువాలతో సత్కరించి ఆహ్వానించారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ తిరుగులేని శక్తిగా ఎదగడం ఖాయమన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీస్

ధన్వాడ: పంచాయతీ సిబ్బంది సమ్మె నోటీస్‌లను బుధవారం ఎంపీడీఓ సద్గుణ, ఎంపీఓ సుదర్శన్‌కు అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 11వ పీఆర్సీలో నిర్ణయించిన బేసిక్ వేతనం రూ.19వేలు అందించాలని, ప్రమాదానికి గురైన కార్మికుని కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారం ప్రభుత్వమే చెల్లించాలని, జీఓ నంబర్ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బలరాం, ఉదయభాను, బాలకృష్ణ, ఇమ్రాన్, రమేష్, లక్ష్మణ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని గురువారం నుంచి చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి రామాంజనేయులు బుధవారం ప్రకటనలో తెలిపారు.

కృష్ణా: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి సమ్మె నిర్వహిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏజీ బుట్టో తెలిపారు. బుధవారం మండలంలోని పంచాయతీ కార్మికులతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాస్‌కు సమ్మె నోటీస్ అందించారు. వారు మాట్లాడుతూ కొంతకాలంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో నరేష్, రమేష్, శరణమ్మ, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి జీఓ నంబర్ 60 ప్రకారం వేతనాలు, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని తదితర డిమాండ్ల సాధన కోసం చేపట్టే నిరవధిక సమ్మె నోటీసును బుధవారం ఎంపీడీఓ శశికళకు అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి నర్సింహులు మాట్లాడుతూ.. తక్కువ వేతానికి పంచాయతీలో అన్ని రకాల పనులు చేస్తున్న వర్కర్లకు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పడుతున్నట్లు తెలిపారు. కార్మిక వర్గం ప్రాణత్యాగాల ద్వారా సాధించిన 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా కేంద్ర ప్రభుత్వం మార్చి కార్మికులను కట్టు బానిసలు చేసిందని ఆరోపించారు. దీనికి వంత పాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 51 తీసుకొచ్చి పంచాయతీల్లో ఏళ్లుగా పనిచేస్తున్న కారోబార్, బిల్ కలెక్టర్ల ఆత్మగౌరవం దెబ్బతీసిందన్నారు. కార్యక్రమంలో భీమప్ప, రాములు, వెంకటప్ప, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.



ధన్వాడలో సమ్మె నోటీసు అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

సీట్లు ఇవ్వని పార్టీలకు ఓటెయ్యం

నారాయణపేట టౌన్: శాసన సభ, పార్లమెంట్ ఎన్నికలో యాదవుల జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని వివిధ పార్టీలను డిమాండ్ చేస్తున్నామని యాదవుల సంఘం జిల్లా కన్వీనర్ తిరుపతి యాదవ్ ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు నేలపై యాదవ ఉపకులాల జనాభా 18 శాతం ఉందని, జనాభా దామాషా ప్రకారమే అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం కరువైయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో యాదవులకు 22 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

సజావుగా బదిలీలు చేపట్టాలి



కోస్గి: ప్రభుత్వం చేపట్టిన మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలు పారదర్శకతతో సజావుగా నిర్వహించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేరి కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం గుండుమాల్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను సందర్శించి ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. బదిలీల్లో ఉపాధ్యాయుల సర్వీస్ పాయింట్లు, ప్రత్యేక కేటగిరి పాయింట్లు, వెబ్ ఆప్షన్లు ఇచ్చే విధానం తదితర అంశాలపై సమగ్రంగా వివరించారు. ఎలాంటి సమస్యలు ఎదురైన సంఘ పరంగా పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, వెంకటేష్, బ్యాలా, రవీందర్, అనంతయ్య, రాజ భూషణ్ రెడ్డి, వెంకట్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరిత్యా నేరం

కోస్గి: చదువుకునే వయస్సులో బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని ఎస్‌ఐ నరేష్ సూచించారు. బుధవారం మండలంలోని కడంపల్లిలో ఆట పాటల ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ బాల్య వివాహాలు, మూఢ నమ్మకాలు, సైబర్ నేరాలు, బ్యాంకు మోసాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించి ప్రయోజకులను చేయాలన్నారు. కార్యక్రమంలో సురేందర్‌గౌడ్, శేఖర్, లింగన్న, కల్యాణి, రుక్యా నాయక్ పాల్గొన్నారు.

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

నారాయణపేట: జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10:30 గంటలకు నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ వనజమ్మ బుధవారం ప్రకటనలో తెలిపారు. సమావేశం సింగారం చౌరస్తాలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరు అవుతారని, అధికారులు తమ శాఖల నివేదికలతో విధిగా రావాలని కోరారు.

ఇథనాల్ కంపెనీని రద్దు చేయండి

మరికల్: చిత్తనూర్ వద్ద నిర్మిస్తున్న ఇథనాల్ కంపెనీ రద్దు చేయాలని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి గోవింద్ డిమాండ్ చేశారు. బుధవారం 5వ రోజు దీక్షను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంపెనీ ప్రారంభమైతే కాలుష్యం వెదజల్లడంతో పాటు చుట్టూ ఉన్న గ్రామాల ప్రజలు అనేక ప్రమాదకార వ్యాధుల బారిన పడతారన్నారు. గ్రామాలు కలిసికట్టుగా తరలివచ్చి కంపెనీ రద్దుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.



ఎమ్మెల్యే మాటలు నమ్మొద్దు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట రూరల్: ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే చెప్పున్న మాయమాటలు విని మోసపోరాదని నాయకులు అన్నారు. అన్ని అర్హతలు ఉన్న కోటకొండను మండలంగా ప్రకటించడంపై బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షను విడనాడాలని డిమాండ్ చేశారు. బుధవారం 57వ రోజు నిరసన దీక్షల్లో దివ్యాంగుల సమైక్య సభ్యులు పాల్గొని మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం కోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే కోటకొండ గ్రామస్తులు అన్ని అర్హతలు ఉన్న తమ గ్రామాన్ని మండలం చేయాలని కోరినా ప్రభుత్వం తిరస్కరించిందని తెలిపారు. ఇటీవల వరుసగా ఎన్నో అనవరమైన గ్రామాలను మండలాలుగా చేసిన ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ధి కోసమే కోటకొండపై వివక్ష చూయిస్తున్నారని వాపోయారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే వెంటనే కోటకొండ వంటి వెనకబడిన ప్రాంతాన్ని మండలంగా మార్చు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి, రాము, కెంచె శ్రీనివాస్, యాదగిరి, చెన్నప్ప, సలీం, నర్సింహులు, కాశప్ప, బాలప్ప, సోమయ్య, బాబు, వెంకటేష్, నరేష్, ఆశప్ప, జహంగీర్ పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించడం తగదు



ధర్నాలో మాట్లాడుతున్న భాస్కర్

ఊట్కూర్: మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఎంపీటీసీ హన్మంతుపై దురుసుగా ప్రవర్తించడం తగదని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్ అన్నారు. బుధవారం స్థానిక చెక్‌పోస్ట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశంలో జింకల బెడద అధికంగా ఉందని, పంటలు వేసిన రైతులు నష్టపోతున్నారని ఎంపీటీసీ ప్రస్తావిస్తే ఆయనపై ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించడం ఎంతవరకు న్యాయమని అన్నారు. ఊట్కూర్ పెద్దచెరువు కింద వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉందని గత ఎన్నికల్లో చెరువుకు నీరందిస్తామని మంత్రి హరీష్‌రావు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులు వేసిన పంటలను జింకల నుంచి కాపాడేవరకు అండగా ఉండి పోరాటం చేస్తామని తెలిపారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పరచలేదని, ఇప్పటికైనా అభివృద్ధికి పాటుపడాలని లేని పక్షంలో ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ధర్నా రెండు గంటల పాటు చేపట్టడంతో మక్తల్–నారాయణపేటకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ రమేష్ చెక్‌పోస్టు వద్దకు వెళ్లి నాయకులతో మాట్లాడి ధర్నాను విరమింపచేశారు. కార్యక్రమంలో కర్నే స్వామి, ఎంపీటీసీలు హన్మంతు, కిరణ్‌కుమార్, నాయకులు రమేష్, భరత్, బలరాం రెడ్డి, కృష్ణయ్యగౌడ్, ఆశప్ప, రఘువీర్, శ్రీకాంత్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

నారాయణపేట టౌన్: ప్రధాని మోడీని, స్థానిక ప్రజాప్రతినిధులను దూషించిన మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌వర్ధన్ ప్రకటనలో బుధవారం డిమాండ్ చేశారు. ఊట్కూర్ మండల కేంద్రంలో మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు ఎమ్మెల్యేకు స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరగా, దుర్భాషలాడారని తెలిపారు. ఒక ప్రజా ప్రతినిధిగా ఉంటూ ప్రధానిపై ఇష్టమొచ్చినట్లు నోరు పారేసుకున్నారని పేర్కొన్నారు. ప్రధానిని దూషించిన ఎమ్మెల్యే బేషరతుగా క్షమాపణ చెప్పాలని తెలిపారు.

సీడీపీఓను సస్పెండ్ చేయాలని నిరసన



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి

మద్దూరు: మండల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ రోజాను సస్పెండ్ చేయాలంటూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్ష బుధవారం రెండో రోజుకు చేరింది. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ నుంచి పాతబస్టాండ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం రిలే దీక్షలో కూర్చున్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ.. ఆయాను సెంటర్లలో ఉంచి అంగన్‌వాడీ టీచర్లు మాత్రమే మంగళవారం దీక్షలో పాల్గొంటే సీడీపీఓ, సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కేంద్రాలను వెళ్లి ఆయాల చేత తెల్లకాగితాలపై సంతకాలు చేసుకొని వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఆయాలచే అంగనవాడీ కేంద్రాలను నడిపిస్తుంటే అధికారులు సమస్యను జఠిలం చేస్తున్నారన్నారు. దీంతో దీక్షలో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను బంద్ చేసి పాల్గొన్నారని తెలిపారు. కార్యక్రమంలో జోషి, అశోక్, శశికళ, పుష్ప, రాధ, రాజ్యలక్ష్మి, వసంతబాయి, చంద్రకళ, నాగజ్యోతి, అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

పీటీఐలకు సర్దుబాటు చేయరాదు

నారాయణపేట రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీల స్థానంలో చేపట్టిన సర్దుబాటు నుంచి పీటీఐలను విస్మరించాలని ఆ సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. బుధవారం డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు కళలు, వృత్తి నైపుణ్యాలతో పాటు ఆటల కోసం ఎంపిక చేసిన పార్ట్ టైమ్ ఇన్‌స్ట్రక్టర్లను ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధనకు కేటాయించడం సరికాదన్నారు. ప్రస్తుతం జిల్లాలో అమలు జరుగుతున్న 45రోజుల విద్యా కార్యక్రమం దృష్ట్యా కేటాయించారా, ఏడాది మొత్తం పనిచేయాలా? అనేది ఆదేశాల్లో తెలియజేయపలేదని అన్నారు. అర్హత లేకున్నా బలవంతంగా పాఠ్యాంశాలను బోధించాలనడం ఇబ్బందికరమన్నారు. ఈ విషయంలో వెంటనే కలెక్టర్ చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పస్పుల రవికుమార్, రఘువీర్, కృష్ణకుమార్, సురేష్, అనిల్, అరుణ, సాయిబన్న పాల్గొన్నారు.

స్వీపర్లు లేక విద్యార్థుల అవస్థలు

మాగనూర్: ప్రభుత్వ పాఠశాలలో స్వీపర్లు లేక విద్యార్థుల పడుతున్న బాధలు వర్ణనాతీతంగా మారాయి. కొన్ని రోజులుగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్వీపర్లు నిరవధిక సమ్మెకు దిగారు. దీంతో బడి శుభ్రం చేసే వారులేక ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులే ప్రాంగణంతో పాటు తరగతి గదులను శుభ్రం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ఇలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులతో పనులు చేయించకుండా చూడాలని కోరుతున్నారు.



పర్మన్‌దొడ్డి పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు

కురిసిన వర్షం..

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో మంగళవారం రాత్రి ఏకధాటిగా భారీ వర్షం కురిసింది. పాతబస్టాండ్, కొత్తబస్టాండ్, పాతగంజ్, యాద్గీర్ రోడ్, సివిల్‌లైన్ రోడ్, విజయ్‌కాలనీ లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కావడంతో రోడ్లు దాటేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భారీగా కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం సాయంత్రం తేలిక పాటు గాలి వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో 48.6 మీ.మీ. వర్షాపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.